మినీ కథ

# డిగ్రీ

అలిమేలు తన భర్త వెంకటేశాన్ని వేధించుక తినసాగింది.

ఇంటికి చుట్టుప్రక్కల అన్ని ఇండ్ల ముందు నేమ్‌బోర్డులున్నాయి.

ఇరుగు మేడమీదనున్న కామాక్షి మగడు ఆర్.డి.రంగారావు,యఫ్.ఆర్.ఈ ఎస్(లండన్)

పొరుగింటి మీనాక్షి మగడు డా॥ భుజంగం ఎమ్. బి. బి. ఎస్.

ఇంకా అవతల భవనంలో ఒకాయన బోర్డు మీద చాలా పొడుగు డిగ్రీ వుంది.

పరిసరాలంతా మంచి భవనాలు వున్నాయి. భవనాలలో పెద్ద పెద్ద ఉద్యోగాలవాళ్ళున్నారు.

వాళ్ళకు పెద్ద పెద్ద డిగ్రీలు వున్నాయి.

అలిమేలుకు దిగులు పట్టుకున్నది.

తనకు పెద్దయిల్లు లేకపోతే పోనీ, పెద్ద వుద్యోగమున్న భర్త కాకపోతే పోనీ, ఆ భర్తకు కనీసం ఒకడిగ్రీ అన్నా వుండకూడదూ!

దానికి కూడా తన భర్త నోచుకోలేదా?

"ఏమండీ వాళ్ళందరూ స్టీలుబోర్డులు వేసుకుంటే వేసుకున్నారు. మనం కొయ్యబోర్డు వేసుకుంటాం. ముందు మీరొక బోర్డు రాయించి బయట ద్వారానికి బిగకొట్టించండి. మంచి డిగ్రీ వ్రాయించండి. కనీసం నాలుగు ఇంగ్లీషు అక్షరాలన్నా వుండాలి."

"అలివేలూ! ఇరుగు పొరుగుల అట్టహాసం చూచి నువ్వూ వుబలాట పడుతున్నావుగాని, వాళ్ళ మొగుళ్ళు చదువుకుని డిగ్రీలు వేసుకున్నారు. నేను చదువలేదుగదే నాకు డిగ్రీ ఎట్లా వస్తుందే?

"ఏమో! అదంతా నాకు తెలియదు. రేపు సాయంత్రానికి బోర్డు వుండాల్సిందే, బోర్డు పైన డిగ్రీ రాయాల్సిందే" అన్నది.

"ఓసి నీ దుంప తెగా! ఏ పట్టుపడితే ఆ పట్టేనే" అని నాలిక కరుచుకున్నాడు. తనకు నూకలు చెల్లితేనే కదా దాని దుంప తెగడం.

ఇంటిలోని పోరు ఇంతింత కాకుండా కొండంత అయింది.

ఇక తప్పదు. ఆలోచించాడు

డిగ్రీ ఏమని పెట్టాలి?

ఒక ఆలోచన తట్టింది.

సాయంత్రానికి బోర్డు చేయించి తగిలించాడు ద్వారానికి.

"ఎస్. వెంకటేశం, హెచ్.ఒ.ఎ.యమ్.టి."

అలివేలు చాలా సంబరపడిపోయింది. చక్కగా సింగారించుకుంది. ఇరుగు పొరుగు అమ్మలక్కలు వారి వాకిలివద్ద చేరారు.

అలివేలు కూడా తన వాకిలివద్ద చేరి తానూ ఆ నేమ్ బోర్డును నాజూగ్గా నిమురుతూ, "నన్ను చూడు, మా ఆయన అందమైన నేమ్ బోర్డును చూడమ"న్నట్లు వయ్యారంగా నిలబడింది.

అందరు అమ్మలక్కలూ ఆ నేమ్‌బోర్డు చూచారు. డిగ్రీ అర్థం కాలేదు.

తమ భర్తలను అడిగారు. "హెచ్. ఓ. ఎ యం. టి" అంటే ఏమిటని.

అంతంత చదివిన ఆ భర్తలకూ ఆ డిగ్రీ అంతుబట్టలేదు. తల పగులగొట్టుకున్నారు. అబ్రీవియేషన్ల పుస్తకం తీసుకుని వెతికారు, దానిలో కూడా లేదు.

ఏమిటా డిగ్రీ? ఎలా తెలుసుకోవాలి?

మరుసటిరోజు ఎదురింటి సర్వేశం వెంకటేశాన్ని పిలిచి, కాఫీ యిచ్చి, మర్యాదచేసి, ఆ డిగ్రీ ఏమిటని అడిగాడు.

"అది చెప్పకూడదులేండి!" అంటూ లేచాడు వెంకటేశం.

చుట్టుప్రక్కలవారంతా అలాగే సత్కరించి అడిగారు.

కాని సత్కారాలు అందుకుని సమాధానం దాటవేశాడు వెంకటేశం.

చుట్టుప్రక్కలున్న భార్యాభర్తలకు అది ఒన్ మిస్టరీ అయింది.

ఇంతకీ ఆ డిగ్రీ చెబితే వెంకటేశం చుట్టుప్రక్కలవారి దృష్టిలో నవ్వులపాలవుతాడు.

చెప్పకుంటే కథ పూర్తికాదు. పూర్తిచేయలేకపోయినందుకు నేను నవ్వులపాలవుతాను.

ఆ డిగ్రీ "హజ్బెండ్ ఆఫ్ అలివేలు మంగ తాయారు."

—పచ్చిపులుసు వెంకటేశ్వర్లు.